# డాక్యుమెంటరీ ఆధారాలే కాదు, ప్రస్తుత సాంఘిక వాస్తవాలు కూడా, తెలుగు వడ్డెర్లకు ST ఇవాల్సిన అత్యవసరాన్ని సూచిస్తున్నాయి!

1. వడ్డెర బస్తీలు/పల్లెలు/ పాళేల్లో, ఇప్పటికీ కనిపించే, దుర్భర జీవన దృశ్యాలు, వడ్డెర్ల ST అర్హతకు అద్దం పడుతున్నాయి. ఇప్పటికీ, ఎక్కువ శాతం కులవృత్తి చావులు/ప్రమాదాలు, కేవలం సంచార వడ్డెర్లు మగ్గుతున్న, రాయి/ మట్టి పనుల్లోనే జరుగుతున్నాయన్న వాస్తవం కూడా, మరో ST అర్హతే!

2. వడ్డెర్లు ఉండే ప్రాంతాల్లో, పోలీసు స్టేషన్లలో రికార్డు కాబడుతున్న కేసులు, పంచాయితీలు, ఫ్యామిలీ కౌన్సిలింగ్ సెషన్స్ లో ఎక్కువ శాతం వడ్డెర్లు ఉండటం కూడా, వారి శారీరక హింసతోకూడిన వృత్తివల్ల సంక్రమించిన, వెనుకబాటుతనం వల్లనే, సంభవిస్తోంది.

3. రాయి/మట్టి పనుల్లో సంపాదన పెరగడంతో, వడ్డెర కుల వృత్తి వ్యాపారాల్లో, పై లేయర్ లో ఉంటూ, కోట్లు గడిస్తున్న వారు, కులవృత్తి నెపంతో, వడ్డెర్లను, తెలివిగా, కేవలం రాయి/మట్టి పనికి మాత్రమే పరిమితం చేయడంతో, వీరి జీవితాలు నాశనమైన తీరు చూసైనా, ప్రభుత్వాలు వడ్డెర్లను త్వరితంగా ST లో చేర్చాలి.

4. అత్యంత ప్రమాదకర వృత్తిలో అను నిత్యం చస్తున్న, అతి పెద్ద శ్రామిక తెగ వడ్డెర్లకు, ఇప్పటికీ లేబర్ కార్డు లేకుండా ప్రమాద భీమా లభించడంలేదంటే, ఇది రాష్ట్ర ప్రభుత్వాల వైఫల్యమే! రాజకీయంగా ఎదిగిన సాటి BC కులాలకు, ఏ కార్డు లేకుండా ప్రమాద భీమా లభించినా, వడ్డెర్లు ఇంకా లేబర్ కార్డుల కోసం ఎదురు చూస్తున్నారంటే, వడ్డెర్లకు, ST ఎంత అవసరమో తెలుస్తోంది. ఇప్పటికీ, ఒక్క MLA/MP/MLC కూడాలేని శ్రామిక కులాన్ని, తెలుగు రాష్ట్రాల ప్రభుత్వాలు, 50 ఏళ్ళుగా, ST ప్రామిస్ చేస్తూ, ఆచరణలో మాత్రం, ST కోసం ప్రయత్నించకుండా, కేవలం గుట్టలు/తట్టల మాటలతోనే, సరిపెడుతున్నారు.


5. నేర తెగ మరకవల్ల, గతాన్ని కోల్పోయిన వడ్డెర్లకు, ఇప్పటికీ చరిత్ర లో ఇవ్వాల్సిన స్థానం ఇవ్వకపోవడం దారుణం. సైరా సినిమాలో, స్వతంత్ర సమరయోధుడు, వడ్డే ఓబన్న పాత్రను అంత సునాయాసంగా అవమానపర్చడం కూడా, వడ్డెర్లపై, సమాజం చూపిస్తున్న నిర్లక్షాన్ని సూచిస్తుంది.

పైవన్నీ చదివినవారు, పై డాక్యుమెంట్ లో తప్పులుంటే నిలదీయడమే కాదు, ఒప్పనిపిస్తే, వడ్డెర్ల ST పోరుకు సహకరించమని అభ్యర్థిస్తూ,

వడ్డెర్ల ST సాధన సమితి
వెబ్సైట్: www.vsss.info   ఫోన్: 7893682052/9550136660



# రాజ్యాంగం నిర్ణయించిన ST అర్హతలు, వడ్డెర్లకు పుష్కలంగా ఉన్నాయి!


Vadders

వివిధ పేర్లతో భారతఉపఖండం అంతా విస్తరించియున్న ఆదిమ సంచార తెగలైన వడ్డెర్లు, బ్రిటీష్ వారు అంటించిన నేరతెగ మరకతో, వారి ఘన చరిత్రను సైతం కోల్పోయి, అన్ని రంగాల్లో వెనుకబడ్డారు కాబట్టే, దేశం మొత్తంలోని 70 శాతం వడ్డెర్లను ఇప్పటికే SC/ST ల్లో చేర్చారు.

అయితే, ఉమ్మడి అంధ్రప్రదేశ్లో మాత్రం, సాటి నేర తెగలైన ఎరుకల, యానాది, లంబాడీ వంటి తెగలను సైతం STల్లో చేర్చి, తెలుగు వడ్డెర్లను మాత్రం, 50 ఏళ్లుగా BC ల్లో పడేయడంతో, తెలుగు వడ్డెర్లు తమకు న్యాయంగా రావలసిన రాజ్యాంగం ప్రామిస్ చేసిన ST హక్కు కై, ఇప్పటికీ, పోరాడుతూనే ఉన్నారు. ఈ నేపథ్యంలో, ST లో చేర్చడానికి వడ్డెర్లకున్న ఆధారాలు మరియు అవకాశాల పై విస్తృత చర్చ జరుగుతోంది.
ఇలాంటి పలు ప్రశ్నలకుసమాధానమిస్తూ, వడ్డెర్ల ST సాధన సమితి అధ్యక్షులు, Dr. జెరిపేటి చంద్రకళ & Dr. ఒర్సు శ్రీనివాస కుమార్ రాజు గారు రీసెర్చ్ చేసి రాసిన ఈ ST డాక్యుమెంట్ అందరికీ అందుబాటులోకి తేవడం జరిగింది.
వడ్డెర్లకున్న ST అర్హతలను, క్లుప్తంగా డాక్యుమెంటరీ ఆధారాలతో సహా, ఇక్కడ పొందు పరుస్తున్నాము.

## 1. ఆదిమ లక్షణాలు (Primitive Traits)

1.1 ప్రముఖ ఫ్రెంచ్ మానవజాతి శాస్త్రవేత్త Abbe J.A. Dubois వ్రాసిన "Hindu Manners Customs & Ceremonies" పుస్తకం లో (పేజ్ 70-71) వడ్డెర్లను, పని వెతుక్కుంటూ తిరిగే ఆదిమ సంచార తెగలుగా అభివర్ణించారు.

1.2 ప్రముఖ బ్రిటిష్ సామాజిక శాస్త్రవేత్త Edgar Thurston వ్రాసిన "Castes & Tribes of South India Vol. 5" (పేజ్ 428) లో, 1909 వరకు సేకరించిన వడ్డెర్ల జనాభా లెక్కల ఆధారంగా, వారిని, ఆదిమ లక్షణాలు కలగిన, సంచార తెగలుగా నిర్ధారించారు.

1.3 ప్రముఖ బ్రిటిష్ సామాజిక శాస్త్రవేత్త Edgar Thurston వ్రాసిన "Castes & Tribes of South India Vol. 5" (పేజ్ 422-426) లో, వడ్డెర్లను, వేటాడి తినే, ఆటవిక ఆహార అలవాట్లు కలవారిగా అభివర్ణించాడు. వీరు, అడవి ఎలుకలు, ముళ్లపందులు(porcupines), చీమల్ని తినే ప్రాణులు(ant eaters) మరియు పొలుశు పందుల(Pangolius or Manis Pentadactyla) వంటి ప్రాణులను, వేటాడి తినేవారని వ్రాసారు.

## 2. ప్రత్యేక సంస్కృతి(Distinct Culture)

2.1 Govt. Central Press, Bombay వారు 1905 లో ముద్రించిన Notes on Criminal Classes in the Bombay Presidency లోని పేజీ 167 లో, వడ్డెర్ల ప్రత్యేక సంస్కృతి గురించి రాస్తూ, "వడ్డెర మహిళలు, కుడి చేతికి మట్టి గాజులు ధరించరు. కుడి చేతికి కేవలం, ఇత్తడి/కాస కంకణాలను మాత్రమే ధరిస్తారు" అని అన్నారు. "అంగీ, ధోతీ, ఉత్తరీయం మరియు కంబళి వంటి ప్రత్యేక శ్రామిక దుస్తులను, పురుషులు ధరిస్తారు" అని స్పష్టంగా రాశారు. ఇదే పేజీలో, వడ్డెర్లు సంచార తెగలుగా సంచరిస్తూ, గ్రామాలకు మరియు జనావాసాలకు దూరంగా వెదురు/గడ్డి/చాప పాకల్లో, వారి గాడిదలు, మేకలు మరియు రాతి చక్రాల బండ్లతో, జీవిస్తారని తెలిపారు. వడ్డెర్ల ఆదిమ తెగ ఆటవిక నైపుణ్యాన్ని, దగ్గర గ్రామాల్లోని రైతులు, అడవి పందులు వంటి పంటను నాశనం చేసే జంతువులను పట్టి చంపడానికి ఉపయోగిస్తారని, ప్రత్యేకంగా చెప్పారు. అదే గ్రంధంలోని పేజ్ 168 లో, వడ్డెర్లకు మాత్రమే అర్ధమయ్యే, ఒక ప్రత్యేకమైన తెలుగులోనే, వడ్డెర్లు మాట్లాడుకుంటారని కూడా స్పష్టం చేశారు.

2.2 ప్రముఖ బ్రిటిష్ సామాజిక శాస్త్రవేత్త Edgar Thurston వ్రాసిన "Castes & Tribes of South India Vol. 5" (పేజ్ 422-436) లో వడ్డెర్లు పాటించే ప్రత్యేక సాంస్కృతిక లక్షణాలను క్లుప్తంగా వివరించారు. పుట్టుక మొదలు, నామకరణం, రజస్వలతంతు, పెళ్లి, పండుగలు మరియు చావు వరకు, వీరు పాటించే సాంస్కృతిక ప్రత్యేకతల్లో, కొన్నిముఖ్యమైనవి:

a) వడ్డెర్లకు, పుట్టుకతో, నుదుటన పొడిచే పచ్చబొట్టును, వారు భూలోకంలో వారి పుట్టుకకు చిహ్నంగా, భావిస్తారు.

b) వడ్డెర్లు, ప్రత్యేక రజస్వల(పుష్పవతి) తంతును జరుపుతారు. ఇందులో భాగంగా, ప్రత్యేక మూలికలు, ఆకులు, అడవి మొక్కలను, బాలిక వద్ద ఉంచి, దుష్టశక్తులను దూరం పెడతారు.

c) వడ్డెర్లు 'ఓలి' అనే ప్రత్యేక పదంతో, కన్యా శుల్కం మరియు పెళ్లి మాట ఖరారు వంటివి నిర్ణయిస్తారు. ఇప్పటికీ నైజాంలో వినిపించే, వడ్డెర్ల 'కల్లు బయాన్' కూడా, ఇలాంటిదే!

## 3. భౌగోళికంగా కొన్నిప్రాంతాలకు పరిమితమవ్వడం(Geographical Isolation)

3.1 Govt. Central Press, Bombay వారు 1905 లో ముద్రించిన Notes on Criminal Classes in the Bombay Presidency, పేజ్ 167లో, వడ్డెర్ల పై రాసిన చాప్టర్ ప్రారంభించినప్పుడే, వారిని, "ఎక్కడ పని దొరికితే, అక్కడ తాత్కాలిక శిబిరాలను/గుడారాలను ఏర్పరచుకునే సంచార తెగ" గా నిర్వచించారు.

3.2 https://shodhganga.inflibnet.ac.in/ లో భద్రపరచిన UOH మల్లి గాంధీ గారి రీసెర్చ్ పేపర్, "A Historical  Survey of Ex-Criminal Tribes Settlements in Andhra: A Case Study of Sidhapuram and Stuartpuram Settlements" లో, వడ్డెర్లను కొన్ని ప్రాంతాలకు మాత్రమే పరిమితమయ్యే, సంచార తెగలుగా గుర్తించారు. ఈ విషయాన్ని నిర్ధారిస్తూ, నల్లమల అడవుల పరిసరాల్లో ఉన్న తెగలతో కలసి, వడ్డెర్లు కూడా కేవలం కొన్ని ప్రాంతాలకే పరిమితమై జీవిస్తున్నారని, తెలిపారు. ఈ విషయాన్ని, అప్పటి బ్రిటీష్/నిజాం ప్రభుత్వాలు, నేర తెగల్లో(NT)  మార్పు కోసం, ఏర్పాటు చేసిన రిఫార్మేటరీ సెటిల్మెంట్స్ (Reformatary Settlements) ప్రదేశాల వివరాల్లో కూడా, ధృవీకరించారు. 1913 లో, బ్రిటీషువారు ప్రారంభించిన కర్నూల్ జిల్లాలోని సిద్దాపురం సెటిల్మెంట్ మరియు 1917లో నిజాం ప్రభుత్వం ప్రారంభించిన ఉమ్మడి మహబూబ్ నగర్ జిల్లాలోని, లింగాల సెటిల్మెంట్లలో కూడా, ఎక్కువ శాతం వడ్డెర్లే ఉండేవారని, ఈ రీసెర్చ్ తెలుపుతోంది.



## 4. జనావాసాలకు దూరంగా బ్రతకడం(Shyness of contact with the community at large)

4.1 Govt. Central Press, Bombay వారు 1905 లో ముద్రించిన Notes on Criminal Classes in the Bombay Presidency లోని పేజీ 167 లో, వడ్డెర్లను, జనావాసాలకు మరియు గ్రామాలకు దూరంగా నివసించే, సంచార తెగలుగా, గుర్తించారు.

4.2 బ్రిటీష్ రిపోర్టులు మొదలు, నిన్నటి బాలకృష్ణ రేణుకే కమీషన్ రిపోర్టు వరకు, వెలువడిన, అన్నిఅధికారిక నేరతెగల(NT) రిపోర్టులన్నీ, వడ్డెర్లు కూడా జనావాసాలకు దూరంగా ఉంటూ, సాంఘికంగా పూర్తిగా అన్యాయమైపోయారన్న విషయాన్ని, ధృవీకరిస్తున్నాయి. స్వతంత్రానంతరం, కొన్ని నేర తెగలకు, SC/ST గుర్తింపు లభించి, లాభం చేకూరినా, తెలుగు వడ్డెర్లను మాత్రం, BC ల్లోకి తోయడం వల్ల, అపార సాంఘిక నష్టం వాటిల్లి,  నేరతెగ మరక వల్ల, చివరికి కులం పేరు కూడా చెప్పుకోలేక, జనావాసాలకు మరింత దూరమయ్యారన్న వాస్తవాన్ని, ఈ రిపోర్టులన్నీ, నిర్ధారిస్తున్నాయి.

## 5. అన్ని రంగాల్లో వెనుకబడిపోవడం(Backwardness)

5.1 ప్రముఖ బ్రిటిష్ సామాజిక శాస్త్రవేత్త Edgar Thurston వ్రాసిన "Castes & Tribes of South India Vol. 5" లో వడ్డెర్లను, "యజమానులను గుడ్డిగా నమ్మే, వెనకబడ్డ అమాయక తెగ" అని వ్రాసారు.

5.2 Govt. Central Press, Bombay వారు 1905 లో ముద్రించిన Notes on Criminal Classes in the Bombay Presidency లోని, పేజీ 169లో, వడ్డెర్ల వెనుకబాటుతనం గురించి రాస్తూ, "ఇతర అణుగారిన వర్గాలకు మల్లే, వీరి జీవనశైలిలో కూడా పూర్తి వెనుకబాటుతనం కనబడుతుంది" అని చెప్పారు. ఇదే గ్రంధంలోని పేజీ 169-172 ల్లో(ఇతర CT తెగల గ్రంధాల్లో కూడా), వడ్డెర్లకు బ్రిటీష్ వారు అంటించిన నేరతెగ మరక వల్ల సంక్రమించిన నేర ప్రవృత్తిని వివరించి రాయడం కూడా, వడ్డెర్ల సాంఘిక, ఆర్థిక అధోగతికి పరోక్షంగా దోహదపడిందని చెప్పాలి. అదెలా అంటే, ఇలాంటి గ్రంధాలను లోతుగా చదివి, బ్రిటీష్ వారి కుట్రను అర్థం చేసుకోలేని వారు, వడ్డెర్లను, ఇప్పటికీ అదే విధంగా చూడటం వల్ల, వడ్డెర్లు మరింత సాంఘిక వెనుకబాటుతనం మరియు విస్మరణకు లోనవుతున్నారని, సాంఘిక శాస్త్రవేత్తలు కూడా, అభిప్రాయ పడుతున్నారు.

5.3 బ్రిటీష్ పాలకులు రూపొందించిన Census Report of 1871 లో సైతం, వడ్డెర్లను, ప్రొఫెషనల్ నేరస్తులకు, నేరాలు/లూటీలలో సహకరించే వారని, అధికారికంగా ప్రకటించి, వడ్డెర్లపై దురుద్దేశంతో రుద్దిన నేర తెగ(CT act) మరకకు, మరింత బలం చేకూర్చారు. ఇలాంటి రిపోర్టులు చేసిన అన్యాయానికి, పరిహారంగా ఇవ్వాల్సిన, ST ఇవ్వకపోవడంతో, వడ్డెర్లు అన్ని రకాలుగా మరింత నష్టపోయారన్న నిజం, ఇక్కడ కనిపిస్తుంది.